సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



కేయూలో విద్యార్థులకు హాస్టల్ వసతి

కేయూలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు హాస్టళ్లలో వసతి కల్పించనున్నారు. - 8లో▸



రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

వరంగల్ జిల్లా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.4⁰ /22.2⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యానిధికి దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: విదేశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

క్యాంటీన్‌లో నాణ్యత పాటించాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణి క్యాంటీన్‌లో నాణ్యత పాటించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియాలోని కేటీకే ఓసీ–2 గని మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ రాంచందర్ మాట్లాడుతూ.. క్యాంటీన్‌లో చేస్తున్న ఆహార పదార్థాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గనిలో కార్మికులతో సంతకాల సేకరించినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం కాకుండా కాంట్రాక్టర్లతో క్యాంటీన్‌లను నడిపించడం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపించారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరీముల్లా, చేరాలు, రవీందర్, పర్వతాలు, మల్లేష్, రాజమొగిలి పాల్గొన్నారు.

మహదేవపూర్ ఏఈఓ సస్పెన్షన్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో వ్యవసాయశాఖలో పనిచేస్తున్న ఏఈఓ ధర్మేంద్రను ప్రభుత్వం సస్పెన్షన్ చేసినట్లు ఏడీఏ కె.శ్రీపాల్ మంగళవారం తెలిపారు. రైతు బీమాకు సంబంధించి రైతుల వివరాలను ఎన్‌రోల్‌మెంట్ చేయడంలో ఆలస్యం చేస్తుండడంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేసినట్లు ఆయన తెలిపారు.

డిపోలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

భూపాలపల్లి: ఆర్టీసీ భూపాలపల్లి బస్‌డిపోలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. మహిళా కాంట్రాక్ట్ కార్మికులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గత కాంట్రాక్టర్లు ఎవరూ తమతో అలా వ్యవహరించలేదని, కొత్తగా వచ్చిన ఇతను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మహిళా కార్మికులు వాపోతున్నారు. తమ నెలసరి వేతనం నుంచి రూ.2,100 కమిషన్‌గా తీసుకుంటున్నాడని, ఇదేంటని ప్రశ్నిస్తే.. ఇష్టం ఉంటే పని చేయండి, లేదంటే మానుకొమ్మని చెబుతున్నట్లు సమాచారం. 'మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, ఎవరికి చెప్పుకున్నా నాకు ఒరిగేదేమీ లేదు' అని సదరు కాంట్రాక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. బాధితులు ఇటీవల సదరు కాంట్రాక్టర్‌పై ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఉచిత కంటి ఆపరేషన్లు విజయవంతం

ములుగు: హైదరాబాద్‌లోని శంకర్ ఆస్పత్రి సహాయంతో జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్లు విజయవంతంగా ముగిశాయి. మొత్తం 104 మంది నిరుపేద వృద్ధులకు తన సొంత ఖర్చులతో బస్సుల్లో తీసుకెళ్లి ఆపరేషన్ పూర్తయ్యేంత వరకు ఐదురోజుల పాటు వారితోనే గడిపిన ట్రస్టు చైర్మన్ భూక్య జంపన్ననాయక్ ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేసి మంగళవారం వారిని తిరిగి బస్సుల్లో సురక్షితంగా తమతమ ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేయించుకున్న వారంతా జంపన్ననాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉచితంగా భోజన సౌకర్యం, ఉండేందుకు వసతి కల్పించి బిడ్డలా చూసుకున్నారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

స్పేసర్ల అమరిక

ఏటూరునాగారం: మండల కేంద్రంలో విద్యుత్ వైర్లు జులాడుతున్నాయని ట్రాన్స్‌లో అధికారులు, సిబ్బంది మంగళవారం వైర్ల మధ్యలో స్పేసర్లను అమర్చారు. విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు కొట్టేస్తున్నాయని ఏఈ అశోక్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లకు మధ్యలో స్పేసర్లను అమర్చి వైర్లు తాకకుండా చేశామన్నారు. ఎక్కడైన విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కొండ సమ్మయ్య, శ్రీనివాస్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విచారణ

కాళేశ్వరంపై నేడు క్రాస్ ఎగ్జామినేషన్! 'కాగ్' నివేదికలు ప్రామాణికం



- ఇరిగేషన్ అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాచారం
- 2024 'కాగ్' నివేదికలోని అంశాలపైన ఆరా తీయనున్న కమిషన్
- ఈనెల 29వరకు సాగనున్న విచారణ
- రిటైర్డ్, విధుల్లో ఉన్న ఇంజినీర్లలో కలకలం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం నుంచి మళ్లీ విచారణ చేపట్టనుంది. ఈ మేరకు ఆ ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులకు కమిషన్ సమాచారం అందించింది. గతేడాది అక్టోబర్ నుంచి ఇన్వెస్టిగేషన్ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలను మరోసారి చర్చించనున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, లోపాలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్(కాగ్) విడుదల చేసిన నివేదికలను ప్రామాణికంగా తీసుకోనుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు శంకుస్థాపన మొదలు.. ప్రారంభం వరకు కీలకంగా వ్యవహరించిన నల్లా వెంకటేశ్వర్లు(రిటైర్డు ఈఎన్‌సీ)తో పాటు ఆయన కనుసన్నల్లో.. ఆదేశాలు, సూచనల మేరకు పని చేసిన చీఫ్, సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ఈసారి విచారించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ అధికారులు ఇప్పుడు విధుల్లో ఉన్నా.. పదవీ విరమణ పొందినా అవసరమైతే వారిని విచారించేందుకు అందుబాటులో ఉండాలని ముందస్తు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, హనుమకొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో నివాసం ఉండే పలువురికి కూడా సమాచారం అందినట్లు పేర్కొంటున్నారు. కొందరు ఇంజినీర్లు, రిటైర్డ్ ఇంజినీర్లు, ఉన్నతాధికారులకు రేపటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ జరగనుంది. 29వ తేదీ వరకు సాగే ఈ క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఎవరెవరికీ ఎప్పుడు సమాచారం వస్తుందో? అన్న టెన్షన్‌లో ఉన్నారు.

ప్రాజెక్టుపై 'కాగ్‌– 2022' అభ్యంతరాలు

- ప్రాజెక్టు లింకు-1 కింద 2016 జూలై నుంచి 2021 డిసెంబర్ మధ్య మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద 80 వేల క్యూసెక్కులు, 65 వేల క్యూసెక్కులు, 57 వేల క్యూసెక్కుల గరిష్ట వరద విడుదలను పరిగణలోకి తీసుకుని మూడు బ్యారేజీలు నిర్మించగా.. గేట్లను మూసివేసిన తరువాత, ఆర్‌సీసీ వేసిన కోటు, సీసీ కర్టెన్ గోడలలో కొంత భాగం, దిగువ భాగంలో నిర్మించిన సిమెంట్ కాంక్రిట్ బ్లాక్‌లు కొట్టుకుపోయి రూ.180.39 కోట్లు నష్టం వాటిల్లింది.



- విడుదలైన నీటి అధిక వేగం, శక్తిని తట్టుకునే విధంగా ఏర్పాటు చేయకపోవడమే ఈ నష్టానికి కారణమని సాగునీటి శాఖ చేసిన అధ్యయనాలు వెల్లడించడం.. మూడు బ్యారేజీలలోని నష్టాలను సరిదిద్దడానికి అంచనా వేసిన మొత్తం రూ.476.03 కోట్లకు సవరించిన అంచనాలను 'కాగ్' బహిరంగపర్చింది. సిమెంట్, కాంక్రీట్ దిమ్మెల ఆప్రాన్ లాంచింగ్ రూపకల్పన లోపభూయిష్టంగా ఉండటంతో ఈ పనులు ఉద్ధార వేగాన్ని తట్టుకోలేక కొట్టుకుపోయి రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లినట్లు తేల్చింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు లింకు-1 కింద చేపట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల నిర్మాణం, ఎత్తిపోతలలకు వ్యయం విపరీతంగా పెంచి.. రూ.10,783.30 కోట్లతో అప్పగించిన పనుల విలువ రూ.21,297.11 కోట్లకు చేర్చారని 'కాగ్' పేర్కొంది. సవరించిన అంచనాలు, అనుబంధ ఒప్పందాలు, వర్క్‌స్లిప్‌ల ప్రకారం మేడిగడ్డ అంచనాలు 74 శాతం, అన్నారం బ్యారేజీ 77 శాతం, అన్నారం ఎత్తిపోతల వ్యయం రూ.1,669.23 కోట్ల నుంచి రూ.3,772.56 కోట్ల(126 శాతం)కు పెరిగిందని నివేదిక వెల్లడించింది. అలాగే సుందిళ్ల ఎత్తిపోతలకు ఖర్చు 106 శాతం పెరిగింది.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ, పంపుహౌస్‌ల నిర్మాణ పనుల వ్యయం పెరిగినప్పటికీ 2018 ఫిబ్రవరి నుంచి ఆగస్టు మధ్యలో పూర్తి కావాల్సిన ఈ పనులు ఒక్కోటి 15 నెలల నుంచి 41 నెలల ఆలస్యంగా పూర్తయినట్లు ఆధారాలతో పేర్కొంది. ఈ బ్యారేజీల కోసం నిర్దేశించిన భూసేకరణ ఇంకా పూర్తి కాలేదని, 7,153.77 ఎకరాలకు గాను 5,240.78 ఎకరాలు సేకరించగా, భూముల ధరలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇంకా 1,912.99 ఎకరాలు.. ఎప్పుడు, ఎలా సేకరిస్తారని ప్రశ్నించింది.

...వీటన్నింటితో పాటు ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికల్లో తేలిన లోపాలు, అంశాలపై సమగ్ర విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరు కావడానికి సంబంధిత ఇంజినీర్లు, ఉన్నతాధికారులు సిద్ధం కాగా.. ఈసారి విచారణలో ఏం తేలనుందనే ఉత్కంఠ ఆ వర్గాల్లో కనిపిస్తున్నది.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ, సీఐ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల: సీసీ కెమెరాలతో నేర నియంత్రణ సాధ్యమని డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను మంగళవారం సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, ప్రధాన రోడ్ల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు, దొంగతనాలు జరిగినప్పుడు కేసులు ఛేదించడం సులభతరమవుతుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు చేసేందుకు సైతం దొంగలు వెనుకడుగు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెండో ఎస్సై ఎండీ షాఖాన్, ట్రైనింగ్ ఎస్సైలు మహేష్, రాజశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సదయ్య, వ్యాపారస్తులు రంగన్న, హరికృష్ణ, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చెకుముఖి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను డీఎస్పీ సంపత్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెకుముకితో విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందుతుందని అన్నారు. చెకుముఖి సైన్స్ సంబరాల మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి మాట్లాడుతూ నవంబర్ 21న మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. మండలంలోని ప్రతీ విద్యార్థి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెండో ఎస్సై ఎండీ షాఖాన్, ట్రెయినీ ఎస్సైలు మహేష్, రాజశేఖర్, ఉపాధ్యాయులు కూచనపల్లి శ్రీనివాస్, బండారు సదయ్య, వ్యాపారస్తులు రంగన్న, హరికృష్ణ, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతోనే అవినీతి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

భూపాలపల్లి అర్బన్: రాజకీయ జోక్యంతోనే సింగరేణిలో అవినీతి పెరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం వల్లనే అవినీతి పెరిగిపోయిందని.. నాలుగు సంవత్సరాలు స్ట్రక్చర్ సమావేశాలు జరగక కార్మికుల అనేక సమస్యలు పరిష్కారానికి నోసుకోలేదన్నారు. కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాల వయసు 35నుంచి 40 సంవత్సరాల వరకు పెంచినట్లు చెప్పారు. యాజమాన్యం ఇప్పటి వరకు సర్క్యులర్ ఇవ్వలేదన్నారు. దీంతో 400 వరకు పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, మారుపేర్లతో కారుణ్య నియామకాలకు వారసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విజిలెన్స్ విచారణతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. 2021 నుంచి స్ట్రక్చర్ సమావేశాలు జరగలేదని, క్యాడర్ స్కీమ్ పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మైనింగ్ స్టాఫ్ కార్మికులకు సుటబుల్ డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సింగరేణి అవినీతి అధికారులు రాజకీయ జోక్యం వల్లనే సింగరేణి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. రాజకీయ నాయకులు కార్మిక సంఘాలు అవినీతిని నిర్మూలించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్మికుల సొంతింటి కల నేరవేర్చే విధంగా, కొత్త గనుల ఏర్పాటుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు మాతంగి రాంచందర్, ఆసిఫ్‌పాషా పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఏరియా సింగరేణి ఎంవీటీసీలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఎంవీటీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో క్యాంటీన్లు ఉన్నాయని.. వాటిని కార్మికులు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. శిక్షణ కోసం వీటీసీకి వచ్చే కార్మికులకు క్యాంటీన్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. క్యాంటీన్‌లలో టిఫిన్, భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఈ కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, రాజేందర్, రామారావు, సమ్మయ్య, జాహిత్, నరేష్, సంపత్, శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి.నారాయణరావు సూచించారు. కొయ్యూరు గ్రామంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలతతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలతో పాటు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అనేక మంది గ్రంథాలయాల్లో చదువుకొని ఉన్నత స్థానాల్లోకి వెళ్లారని తెలిపారు. అనంతరం కొయ్యూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వీరభద్రయ్య, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



మల్హర్: అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీఓ నారాయణరావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి వి.నారాయణరావు తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని పుస్తకాల వినియోగంపై ఆరా తీశారు. సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం అంబట్‌పల్లి అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ కార్యదర్శి టీ.శ్రీలత, ఎంపీఓ ప్రసాద్, పీఆర్ డీఈఈ సాయిలు ఉన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కాళేశ్వరం: పలిమెల మండలం పంకెన ఇసుక క్వారీ నుంచి అధికలోడ్‌తో తరలిస్తున్న నాలుగు టిప్పర్లను మేడిగడ్డ వద్ద ఎల్అండ్‌టీ రోడ్డులో పోలీసులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. రెండు రోజులుగా పోలీసులు ఓవర్‌లోడ్‌తో తరలిపోతున్న లారీలపై ఫోకస్ పెట్టారు. దీంతో రాత్రి, పగలు పలిమెల, మహదేవపూర్ మండలం పెద్దంపేట గుండా తరలిస్తున్న లారీలను నిలిపి తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు టిప్పర్లు పంకెన క్వారీ నుంచి తరలివస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించి వేబ్రిడ్జి వద్ద తూకం వేశారు. దీంతో నాలుగు ఇసుక టిప్పర్లలో నిర్దేశించిన బరువు కన్నా ఎక్కువగా ఉండడంతో కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు.

విడిపించడానికి తంటాలు..

మహదేవపూర్ మండలానికి చెందిన ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ మండలస్థాయి నాయకుడి టిప్పర్లు పోలీసుల తనిఖీల్లో పట్టుబడడం అర్ధరాత్రి చర్చనీయాంశంగా మారింది. అర్ధరాత్రి ఆ నాయకుడు మరో పార్టీకి చెందిన నాయకులతో కలిసి అధికారపార్టీకి చెందిన మండల నాయకులతో తీవ్రంగా మంతనాలు జరిపినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదని తెలిసింది. దీంతో ఆయన ఓవర్‌లోడ్ దందా బయటపడింది.



పట్టుకున్న టిప్పర్లు

ప్రసూతి వైద్యులను నియమించాలి

- విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: చిట్యాల, మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకుడు, టీజీ ఎంఎస్ఐడీసీ, వైద్యులతో సిబ్బంది ఖాళీలు, ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి అనువైన స్థలం కేటాయింపు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు, సౌకర్యాల కల్పన, ఖాళీ పోస్టుల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొత్తం వైద్య సిబ్బంది, అందుబాటులో ఉన్న సిబ్బంది, పోస్టులు ఖాళీలపై జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకులు సంయుక్త నివేదికలు అందచేయాలని పేర్కొన్నారు. సమీక్షలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్న కలెక్టర్ త్వరితగతిన ప్రక్రియ పూర్తిచేసేలా కృషిచేయాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి అనుకూలమైన భూమి కేటాయించాలని సూచించారు. పలు మండలాల్లో ఉన్న ఉప ఆరోగ్య కేంద్రాలు తగిన సదుపాయాల లేమితో ఉండటాన్ని పరిగణలోకి తీసుకొని, ఆయా కేంద్రాలకు తక్షణమే అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాల కల్పన నివేదికలు అందజేయాలని స్పష్టంచేశారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండే విధంగా డ్యూటీ రోస్టర్ నిర్వహణను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో రెగ్యులర్‌గా సమీక్షించే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ నవీన్‌కుమార్, టీజీ ఎంఎస్ఐడీసీ ఏఈ రవికిరణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి..

విద్యార్థులు ఏకాగ్రతతో వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఐటీఐ కళాశాలను ఆకస్మిక తనిఖీచేసి విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా ఆధునిక శిక్షణా కేంద్రం వర్క్‌షాప్ నిర్మాణ పనులను పరిశీలించి డిసెంబర్ మాసం చివరి నాటికి పూర్తయ్యే విధంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేయనున్న పరికరాలను పరిశీలించారు. ఎంఎస్ ఆఫీస్, ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ప్రవేశపెట్టిందని, ఆధునిక శిక్షణా కేంద్రంలో ఆరు ట్రేడుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ జాంలా నాయక్, ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు, శిక్షణా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ వేగిరం చేయాలి..

జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ కార్యదర్శి దాసరి హరిచందన తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌నుంచి జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియా కాన్ఫరెన్స్‌కు ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వేగవంతం చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



ఉపాధ్యాయులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న యాకూబ్‌రెడ్డి

గోవిందరావుపేట: మరో ఐదు నెలల్లో వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మండలంలో మొదలైంది. జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు వేం యాకూబ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను మంగళవారం కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాకూబ్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బాలికల ఉన్నత పాఠశాల గోవిందరావుపేట, జెడ్పీహెచ్ఎస్ పస్రా, ఆశ్రమ పాఠశాల కర్లపల్లి, ప్రాజెక్ట్ నగర్ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదు గురించి వివరించినట్లు తెలిపారు. అప్లికేషన్ ఫామ్స్ ఇచ్చి పలు సూచనలు చేసినట్లు వివరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

చిట్యాల: పిల్లలందరికీ పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. నైన్‌పాకలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం నిర్వహించిన గ్రోత్‌మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచి ఐదు సంవత్సరాల వరకు గల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో వయస్సుల వారీగా బరువును నమోదు చేయాలని.. ఆట పాటలతో విద్యపై ఆసక్తి కలిగించాలన్నారు. పెరగాల్సిన ఎత్తు, బరువుల ఆధారంగా ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారని అన్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తే బాల్యం నుంచి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు రోగనిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, సుజాత, కరుణ, మెడికల్ ఆఫీసర్ మానిక, ఎంపీడీఓ రామకృష్ణ, జయప్రద, సుగుణకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

దీక్షకు మద్దతు

ములుగు రూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) డీఏ అండ్ పీఆర్‌సీ సాధనకు చేపడుతున్న ధర్మాగ్రహ దీక్షకు తెలంగాణ ప్రాంత ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం(టీపీఏయూఎస్) జిల్లా శాఖ పూర్తి మద్దతు ఇస్తుందని యూనియన్ జిల్లా నాయకులు గొల్ల కుమారస్వామి, అన్నవరం రవికాంత్, మంకిడి రవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్మాగ్రహ దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏలు వస్తాయని ఎదురు చూసినా ఫలితం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిశీలించి నెరవేర్చాలన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

- వస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ఒగ్గు రవి



లింగాలఘణపురం: కళ బతకాలంటే కళాకారులు బతకాలి.. అందుకే కళాకారులను ఆదుకోవాలని వస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ఒగ్గు రవి అన్నారు. భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన ఈనెల 15 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ నృత్యమహోత్సవంలో ఆయన తెలంగాణ జానపద కళలపై వివరించారు. 'జానపద కళలు.. గురుశిష్యుల పరంపర' అనే అంశంపై చర్చించారు. రవి మాట్లాడుతూ.. కళాకారులకు ఆరోగ్య, జీవిత బీమా సదుపాయంతోపాటు శిక్షణ తరగతులు, ప్రదర్శనలకు తగిన వనరులు కల్పించాలన్నారు. మధుర ఎంపీ హేమామాలిని, ఎస్ఎన్ఏ చైర్మన్ సంధ్యాపురేశ్సా, సెక్రెటరీ రాజుదాసు పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థులకు హాస్టల్ వసతి

ఫస్టియర్ స్టూడెంట్లకు మెస్ కార్డులు

- ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రెన్యూవల్



కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సులతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు క్యాంపస్‌లోని హాస్టళ్లలో వసతి కల్పించనున్నారు. మొదటి సంవత్సరంలో ప్రవేశాలు, రిపోర్టింగ్ ఈనెల 21న పూర్తికాగా హాస్టళ్లలో విద్యార్థులకు వసతి కల్పన మంగళవారం నుంచి ఇస్తున్నారు. ఓసీ విద్యార్థులకు రూ.12వేలు, బీసీలకు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.8వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.6వేల చొప్పున డిపాజిట్ ఫీజుగా చెల్లిస్తే మెస్‌కార్డులు జారీ చేస్తున్నారు. కేయూలో మొత్తం 14 హాస్టల్స్ ఉన్నాయి.



హాస్టల్ వసతికి దరఖాస్తులు ఇస్తున్న విద్యార్థులు

ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రెన్యూవల్..

ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కూడా మెస్ కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు వచ్చే విద్యార్థులకు రూ .1,000 ఫీజు చెల్లిస్తే హాస్టల్ కేటాయిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిధిలోకి రాని విద్యార్థులు మాత్రం గతేడాదిలో మెస్ బకాయిల్లో సగం చెల్లిస్తేనే మెస్ కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. అలాగే, క్యాంపస్‌లోని వివిధ విభాగాల్లోని రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సుల వారికి కూడా హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. కాగా, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇప్పటికే విద్యార్థులకు వసతి కల్పించారు. సుబేదారిలోని 'లా' హాస్టల్స్‌లో కూడా వసతి కల్పిస్తున్నారు. మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులకు మాత్రం హాస్టల్ వసతి లేదు.

28తేదీ వరకు రెన్యూవల్ చేసుకోవాల్సిందే..

ఫైనల్ ఇయర్ విద్యార్థులు హాస్టల్ వసతి పొందేందుకు ఈనెల 28వతేదీ వరకు మాత్రమే మెస్ కార్డులు రెన్యూవల్‌కు గడువు ఉందని ఆ తరువాత వచ్చేవారికి మెస్ కార్డులు జారీ చేయబోమని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య సీహెచ్. రాజ్‌కుమార్ తెలిపారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొంది హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల నుంచి అండర్ టేకింగ్ తీసుకుంటున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారం తరగతుల అటెండెన్స్‌ను కూడా మెయింటెనెన్స్ చేసుకోవాల్సింటుందని కూడా అందులో పేర్కొన్నారు.

రూ. 1.94 లక్షల విలువైన ఎండుగంజాయి పట్టివేత



గంజాయిని చూపుతున్న సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి

ఖానాపురం: రూ. 1.94లక్షల విలువైన 7.760 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు దుగ్గొండి సీఐ సాయిరమణ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని మారయిగూడేనికి చెందిన అప్కా నాగేశ్వరరావు, కుంట మండలంలోని మారయిగూడేనికి చెందిన నుప కృష్ణ.. ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసిన ఎండు గంజాయిని మంగళవారం వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో విక్రయించడానికి తీసుకెళుతున్నారు. ఈ సమయంలో ఎస్సై రఘుపతి బుధరావుపేటలో పెట్రోలింగ్ నిమిత్తం వెళ్తుండగా ఐనపల్లిలోని విజేత ఐటీఐ కళాశాల ఎదుట అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇందులో రూ. 1.94లక్షల విలువైన 7.760 కిలోల ఎండు గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై రఘుపతి, సిబ్బంది సుమన్, రమేశ్, వీరస్వామి, రాజు, హోంగార్డు ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి



ఎస్‌డీఎల్‌సీఈలో అధ్యాపకులకు ఓటరు నమోదు పత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ బాధ్యులు

కేయూ క్యాంపస్: విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌డీఎల్‌సీఈ, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వరంగల్ కిట్స్, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ఓటరు నమోదుపై ప్రచారం నిర్వహించారు. పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్‌సెక్రటరీ పి. శ్రీహరి, బాధ్యులు అబ్దుల్‌గఫార్, దేవిరెడ్డి మాలకొండారెడ్డి, దండ కోమల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రొండ్ల భానుప్రసాద్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజేందర్, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారును మోసగించి డబ్బులు డ్రా..

- బ్యాంకు మిత్రపై కేసు

నల్లబెల్లి: బ్యాంకు ఖాతాదారును మోసగించి డబ్బులు డ్రా చేసుకున్న నల్లబెల్లి మండలంలోని గుండ్లపహాడ్‌కు చెందిన యూనియన్ బ్యాంకు మిత్ర పడాల రజితపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గోనె ధనమ్మకు నర్సంపేట యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. డబ్బులు అవసరం ఉన్నప్పుడు అదే గ్రామంలో యూనియన్ బ్యాంకు మిత్ర పడాల రజిత వద్దకు వెళ్తే వేలిముద్రతో డబ్బులు డ్రా చేసి ఇచ్చేది. ఈ క్రమంలో తన ఖాతాలో బ్యాలెన్స్ తెలుసుకునేందుకు గత మార్చి 31న రజిత వద్దకు వెళ్లింది. కాగా, ఆమె వేలిముద్ర తీసుకుని ఖాతాలో డబ్బులు నిల్వ లేవని చెప్పింది. మరోసారి జూన్ 6న వెళ్లగా వేలిముద్ర తీసుకుని కేవలం రూ.16 వందలు మాత్రమే ఇచ్చింది. తరువాత జూన్ 14, 15వ తేదీల్లో వెళ్లి ఖాతాల్లో బ్యాలెన్స్ చూడమని కోరగా మళ్లీ వేలిముద్రలు తీసుకుని రికార్డులో సంతకాలు తీసుకుని డబ్బులు లేవని చెప్పింది. అయితే రైతు బంధు, ధాన్యం డబ్బులు తన బ్యాంకు ఖాతాలో జమకావాల్సి ఉండగా ఇంకా ఎందుకుకాలేదని అనుమానంతో గత నెల 30వ తేదీన నర్సంపేట యూనియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులను సంప్రదించింది. మూడు విడతల్లో తనను మోసగించి తన ఖాతా నుంచి రూ.70 వేలు డ్రా చేసుకున్నట్లు గుర్తించింది. అనంతరం రజితపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అర్జున్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆటలో ఏకాగ్రత, పట్టుదల నిలుపుకున్నప్పుడే లక్ష్యం చేరుకుంటారన్నారు. టోర్నమెంట్ల నిర్వహణతో క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు కన్నా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వంద మంది పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులలో నలుగురు బాలికలు, నలుగురు బాలురను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆర్బిటర్లు సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

డమ్మీ తుపాకీతో బెదిరించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

దామెర: డమ్మీ తుపాకీతో బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని దామెర పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం పరకాల ఏసీపీ కిశోర్ కుమార్.. దామెర పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తరువాత ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేసి బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 21న దామెర మండలం ఊరుగొండకు చేరుకుని అర్ధరాత్రి 12 గంటలకు కందికొండ సంపత్ కిరాణాషాపునకు వెళ్లి షట్టర్ కొట్టి లేపాడు. అనంతరం డమ్మీ తుపాకీ చూపించి రూ. రెండు వేలు తీసుకున్నాడు. వెంటనే తేరుకున్న సంపత్.. వెంకటేశ్వర్లును పట్టుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం వెంకటేశ్వర్లుపై కేసు నమోదుచేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు నేరాలకు పాల్పడగా పోలీసులు అతడిపై 15 కేసులు నమోదుచేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఏసీపీ వెంట పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఏఎస్సై రమేశ్, సిబ్బంది ఉన్నారు.

నూనెగింజల సాగుకు ముందుకు రావాలి



బొడ్లాడలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సారంగం, వ్యవసాయ శాఖ అధికారులు

దంతాలపల్లి: ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు నూనె గింజల పంటల సాగుకు ముందుకు రావాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం, టెక్నికల్ అసిస్టెంట్ రవి అన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూనెగింజల సాగులో రైతులకు అధిక మొత్తంలో దిగుబడి పెంచడానికి పొద్దుతిరుగుడు దోహదపడుతుందన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాహిని, విస్తరణ అధికారులు దీక్షిత్, ఉదయ్ కిరణ్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

మోటార్ స్టార్టర్‌లో పాము



చిల్పూరు: మోటార్ స్టార్టర్‌లో నాగు పాము దాక్కుంది. దీనిని పసిగట్టడంతో వాటర్ మెన్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం మండలంలోని కృష్ణాజీగూడెం జీపీకి చెందిన బోరు మోటార్‌ను వాటర్ మెన్ రాజు స్టార్టర్ ఆన్ చేసేందుకు యత్నించగా అందులో ఉన్న నాగుపాము కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రాంబాబు, మాజీ సర్పంచ్ చేరాలు పామును చంపారు.

అధిక సాంద్రత పత్తి సాగు చేయాలి



పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మామునూరు/ సంగెం : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల అధిక దిగుబడి, ఆదాయం పొందొచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్త సౌమ్య అన్నారు. మంగళవారం గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీ, అనంతారం గ్రామాల్లోని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన క్షేత్రాలను కేంద్రియ పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ శాస్త్రవేత్తలు శరవన్, డాక్టర్ హోంరాజ్ బృందం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల పంటకాలం త్వరగా పూర్తవడంతో గులాబీరంగు పురుగు ఉధృతి తట్టుకుటుందన్నారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్, గీసుకొండ వ్యవసాయాధికారులు రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్, ఏఈఓ స్మిత, కేవీకే ప్రొఫెషనల్ హర్షరెడ్డి, సాయి, సుశ్రుత్, రైతులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 12 మంది అరెస్ట్, ఏడుగురు పరార్
- రూ.1,29,540 నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం బమ్మెర శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,29,540 నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో వరంగల్‌కు చెందిన నిమ్మల రాజ్‌కుమార్, అకుల రాజేందర్, కలకుంట శ్యామ్, మూల కుమారస్వామి, పోశాల సతీష్, రెడ్డి సదానందం, తారల రాజ్‌కుమార్, బండి నాగరాజ్, ఎండి.మహబూబ్, నలగిరి యాకయ్య, రాజు, పాలకుర్తికి చెందిన బండి నాగరాజ్, గుంజె రాజు, తార సోమన్న, బాదావత్ తిరుపతి, ఎండి. గౌస్, అజహరుద్దీన్, షాషా, ఎద్దు రాజశేఖర్ ఉన్నారు. ఈ దాడిలో స్థానిక ఎస్సై లింగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు, రంజిత్‌కుమార్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఇంటినుంచి వెళ్లగొట్టారు న్యాయం చేయండమ్మా..

- అదనపు కలెక్టర్‌ను వేడుకున్న వృద్ధురాలు



కాశీబుగ్గ/ కాజీపేట లాంటి: ...

కాశోజీ సెంటర్ : తన కుమారుడు, కోడలు అక్రమంగా తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని తనను వెళ్లగొట్టారని, దీనిపై స్పందించి న్యాయం చేయాలని పర్వతగిరి మండలం చింత నెక్కొండకు చెందిన కాసాని కొమురమ్మ.. అదనపు కలెక్టర్ సంధ్యారాణిని వేడుకుంది. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి కుమారుడు, కోడలు కలిసి తనకు చేసిన అన్యాయాన్ని వివరించారు. గ్రామానికి చెందిన కాసాని కొమురమ్మ, చిన్న కొమురయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తన పేరు మీద తన భర్త కొమురయ్య గతంలో వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిని చిన్న కుమారుడు కాసాని మల్లికార్జున్, చిన్న కోడలు అమూల్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని తనను ఇంటి నుంచి వెళ్లగొట్టి రోడ్డున పడేశారని కన్నీరుమున్నీరుగా విలపించింది. దీనిపై స్పందించి తనకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను వేడుకుంది.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీన నిర్వహించాల్సిన ఈ పోటీలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కొండచిలువ కలకలం



ఎంజీఎం : ఎంజీఎం ఎదుట ఉన్న ఐఎంఏ హాల్ సమీపంలోని ఏటీఎం వద్ద అర్ధరాత్రి కొండ చిలువ కలకలం సృష్టించింది. కొండ చిలువ కనబడడంతో సిబ్బంది అప్రమత్తమై వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు వచ్చి కొండ చిలువ పట్టుకోవడం అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఆపన్న హస్తం అందించరూ!

- గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వేణుగోపాల్‌రావు
- ఆపరేషన్‌కు వర్తించని ఆరోగ్యశ్రీ
- దాతల సాయం కోసం ఎదురుచూపు

దీన గాథ



మంచానికే పరిమితమైన వేణుగోపాల్‌రావు

పర్వతగిరి: అసలే నిరుపేద.. పని చేస్తేనే ఐదు వేళ్లు నోట్లికి వెళ్లేదే. లేదంటే పస్తులే. ఇంత దయనీయ పరిస్థితి అనుభవిస్తున్న ఆ ఇంటి పెద్దకు పెద్ద రోగం వచ్చింది. ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని ఎలగోలా నెట్టుకొస్తుండగా ... మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా మాయదారి మహమ్మారి అతడిని పట్టి పీడిస్తోంది. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇంటి పెద్దను కాపాడుకోవడానికి దాతల సాయం కోస వెయ్యి కండ్లతో ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన బొంపెల్లి గోపాల్‌రావు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గోపాల్‌రావు గుండెలో మూడు బ్లాకులు ఏర్పడ్డాయి. దీంతో బెలూన్స్ ద్వారా ఆపరేషన్ చేస్తేనే బతుకుతాడని వైద్యులు తెలిపారు. దీనికి ఆరోగ్యశ్రీ వర్తించదని, రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వద్దకు తీసుకెళ్లగా రూ.2.5లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ ఇప్పించారు. ఇంకా రూ.2.5లక్షలు అవసరం కాగా ఆపరేషన్ చేయించుకోలేదు. దీనిపై దాతలు ముందుకు వచ్చి తనకు ఆర్థిక సాయం చేయాలని వేణుగోపాల్‌రావు, అతడి భార్య, కుటుంబీకులు వేడుకుంటున్నారు. దాతలు **94911 76210** నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లేదా కెనరా బ్యాంకు అకౌంట్ నంబర్ **110126379345**, **ఐఎఫ్ఎస్‌సీ నంబర్ సీఎన్ఆర్‌బీ0013607**కు సాయం చేయాలని వేణుగోపాల్‌రావు, అతడి భార్య విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సమాజసేవ శిక్ష

వరంగల్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 107 మందిని కోర్టులో హాజరుపరుచగా 100 మందికి రూ. 1,42,400 జరిమానా విధించి ఏడుగురికి రెండు రోజులు సమాజసేవ చేయాలని న్యాయమూర్తి కె. విద్యాసాగర్ శిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రెండు రోజులు సమాజ సేవ చేయాలని పుట్ట శ్రీను, రేవోజు శ్రీనివాస్, మున్నా అలం, జల్లి యాకూబ్, మట్టుపల్లి శివ, కుమ్మరి శ్రీకాంత్, అన్నారపు కిషన్‌ను కోర్టు ఆదేశించింది. దీంతో తీర్పుననుసరించి కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్, హనుమకొండ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరుపరిచినట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 14 మందికి రూ. 12 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ పేర్కొన్నారు.


వేర్వేరు కారణాలతో నలుగురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు మృతి చెందారు. సొంత వైద్యం వికటించి యువతి, రోడ్డు ప్రమాదంలో యువకుడు, విద్యుదాఘాతంతో రైతు, రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందారు.

సొంత వైద్యం వికటించి యువతి..

భూపాలపల్లి అర్బన్: సొంత వైద్యం వికటించి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పారామెడికల్ శిక్షణ పొందుతున్న దుర్గం అంజలి (17) మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం తిరుపతి, రాజశ్రీ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తిరుపతి లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కూతురు అంజలి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఒకేషనల్ శిక్షణ కేంద్రంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) పూర్తి చేసింది. ఏడాది క్రితం నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎంపీహెచ్‌డబ్ల్యూ అప్రెంటీస్ చేస్తోంది. రెండు రోజుల నుంచి జ్వరం రావడంతో దానికి సంబంధించిన మాత్రలు వేసుకుంది. శరీరం నీరసంగా ఉండడంతో సొంతంగా ఇంట్లోనే సోమవారం సాయంత్రం గ్లూకోజ్ ఎక్కించుకుంది. అయితే గ్లూకోజ్‌లో ఏదో ఇంజెక్షన్ కలుపుకోవడమే కాకుండా త్వరగా అయిపోవాలనే ఉద్దేశంతో ఎక్కువ మోతాదు పెంచుకుంది. దీంతో గ్లూకోజ్ వికటించడంతో స్పృహ కోల్పోయింది. ఈ క్రమంలోనే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తున్న క్రమంలోనే మార్గమధ్యలో రాత్రి 12.30 గంటలకు మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



ప్రశాంత్ (ఫైల్)

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన ఆబోతు ప్రశాంత్ (29) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రశాంత్ తన అత్తగారు ఊరు తొర్రూరు మండలం అమ్మపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో మద్దిరాల మండలం గోరెంట్ల సమీపంలో గుర్తుతెలియని వాహనం ప్రశాంత్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, 9 నెలల కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



రాంజీ (ఫైల్)

గూడూరు: విద్యుదాఘాతంతో వ్యవసాయ బావిలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శ్రీహనుమాన్‌తండా శివారు బోరింగ్ తండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోతు రాంజీ (60) సోమవారం ఉదయం వరి పొలానికి నీరు పారించడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ వైర్ తగిలి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. రాత్రి వరకూ రాంజీ ఇంటికి రాకపోవడంతో కొడుకు శ్రీను, మృతుడి భార్య రంగి కలిసి బావి వద్ద చూశారు. ఏదో ప్రమాదం జరిగి ఉండొచ్చని గుర్తించిన కొడుకు వెంటనే బావిలోకి దిగి చూడగా మృతిచెంది కనిపించాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి..



వెంకటేశ్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా, మండలం పెద్ద కల్వలకు చెందిన కల్వల వెంకటేశ్(33) హోమ్ కేర్ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి డోర్నకల్, కాజీపేట మెమో ఎక్స్‌ప్రెస్ రైలు(07754)ను వరంగల్ రైల్వే స్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫామ్ మధ్య ఎక్కుతూ జారి రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులు భాస్కర్, మనోజ్‌కు అప్పగించామని జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపారు.